క్లుప్తంగా

నేత్ర శస్త్రచికిత్సకు 30 మంది ఎంపిక



రోగి కంటి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైద్యుడు

బాడంగి: మండలంలోని గొల్లాదిలో విజయనగరానికి చెందిన అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో వైష్ణవి ట్రస్ట్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. కామన్నవలస, కొత్తపెంట, బూర్జివలస, పాతపెంట, గొల్లాది ప్రాంతాల నుంచి వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న వారంతా ఈ శిబిరానికి హాజరై, నేత్రవైద్య పరీక్షలు చేయించుకున్నారు. మొత్తం 80 మంది హాజరు కాగా వీరిలో 30 మందికి నేత్ర శస్త్రచికిత్స అవసరమైనట్లు గుర్తించామని కార్యక్రమ నిర్వాహకులు చిట్టి రమణారావు తెలిపారు. మిగతా వారికి అవసరమైన మేర ఉచితంగా మందులు అందజేశామన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' సేవలు సద్వినియోగం చేసుకోండి



ఖండ్యాంలో ఇంటింటికీ వెళ్లి, వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

రేగిడి: ఇంటి వద్దకే వైద్యసేవలు అందించాలన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు కోరారు. మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిన వైద్యారోగ్య సిబ్బంది వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులు, మంచానపడిన రోగులకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం స్వాతి తదితరులు పాల్గొన్నారు.

జేవీకే కిట్లు పంపిణీకి సిద్ధంగా ఉండండి



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో ఆదినారాయణ

వంగర: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి, జేవీకే(జగనన్న విద్యాకానుక) కిట్లు పంపిణీకి సిద్ధంగా ఉండాలని జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో వి.ఆదినారాయణ అన్నారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో సిబ్బందితో శుక్రవారం సమావేశమైన ఆయన.. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే పాఠశాలలకు కిట్లు పంపించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సీఎంవో రామారావు, సీఆర్‌ఎంటీలు రెడ్డి వాసు, మజ్జి గణపతి, బి.సాంబశివరావు, ఎస్.శ్రీను, బి.అనూరాధ, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ డి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తనిఖీలు



104 వాహనం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

వంగర: మండలంలోని పటువర్ధనం గ్రామంలో 104 అంబులెన్స్ ద్వారా శుక్రవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. మొత్తం 50 మందికి అవసరమైన మందులను సిబ్బంది అందజేశారు. ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని, ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నీతికథలు చదవాలి



పిల్లలతో కథల పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: చిన్నారులు, విద్యార్థులు ప్రతిరోజూ నీతికథలు చదవడం, ఆ కథల్లో దాగి ఉన్న నీతిని గ్రహించి దాని ప్రకారం జీవించడానికి ప్రయత్నం చేయాలని స్థానిక శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయానికి శుక్రవారం విచ్చేసిన విద్యార్థులతో కథలు చదవించడం, చెప్పించడం చేశారు. కథలు చదవడం ద్వారా నీతిగా ఉండడం ఎలాగో తెలుస్తుందన్నారు.

మొక్కల పెంపకంతోనే
పర్యావరణ పరిరక్షణ



రాజాం సిటీ: పొనుగుటివలస కోనేరు గట్టుపై మొక్కలు నాటుతున్న గ్రామస్తులు

- జూన్ 5న రాజాంలో వెయ్యి మొక్కలు నాటేందుకు చర్యలు
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రణాళికలు
- పర్యావరణ పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు

రాజాం సిటీ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా ఓ మొక్క నాటి, సంరక్షించాలని పర్యావరణ పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు అన్నారు. జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని, స్థానిక వెంకటసూర్యదుర్గ కల్యాణ మండపంలో వెయ్యి మొక్కలు నాటుదాం–వెయ్యి వృక్షాలు చేద్దాం పేరిట పట్టణంలోని పలువురు పర్యావరణ ప్రేమికులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజాం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల పచ్చదనానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల దృష్ట్యా మొక్కల పెంపకం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రోజురోజుకూ భూమి మీద ఉన్న అడవుల శాతం తగ్గిపోవడం వల్లే ఏటా వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, అలాగే వాతావరణంలో కూడా పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సర్వమానవాళి మనుగడతో పాటు సకల జీవరాశుల ప్రాణం మొక్కల పెంపకం మీదే ఆధారపడి ఉందన్న విషయం గుర్తించాలన్నారు. ఇంటి ఆవరణతో పాటు రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ వైర్లు లేని ప్రాంతాల్లో, మొక్కలు నాటేందుకు అనువుగా ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు సిద్ధం కావాలన్నారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛ రాజాంతో పాటు రాజాం పర్యావరణ పచ్చదనానికి సహకరించాలని కోరారు. అలాగే ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేసి, కాలుష్య రహిత సమాజానికి కృషి చేయాలన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన వారందరితో మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాలవలస శ్రీనివాసరావు, శాసపు సత్యనారాయణ, ఆకిరి రామారావు, మజ్జి మదనమోహన్, సీమకుర్తి ప్రసాదరావు, పెంకి గౌరీశ్వరరావు, బీవీ అచ్యుత్‌కుమార్, కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో ఇదే గ్రామానికి చెందిన పలువురు యువకులు గ్రామ కోనేరు గట్టుపై శుక్రవారం మొక్కలు నాటారు. ఏటా జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజునే మొక్కలు నాటడం కాకుండా వీలైనప్పుడల్లా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని యువకులు కోరారు. ప్రతిఒక్కరూ తమ పుట్టిన రోజు, పెళ్లిరోజు తదితర శుభసందర్భాల్లో మొక్కలు నాటి ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో యువకులు రెడ్డి శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, వాసు, అప్పలనాయుడు, శ్రీనివాసరావులు తదితరులు పాల్గొన్నారు.



రాజాం సిటీ: మొక్కలు నాటి సంరక్షిద్దాం అని ప్రతిజ్ఞ చేస్తున్న పర్యావరణ ప్రేమికులు

స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం: స్థానిక పట్టణంలోని జీఎంఆర్‌నగర్‌లో జీసీఎస్‌ఆర్ కళాశాల పక్కన జీఎంఆర్ నాగావళి ఉచిత స్వయం ఉపాధి శిక్షణా సంస్థ(నైరేడ్)లో పలు కోర్సుల్లో శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. పురుషులకు 75 రోజుల పాటు రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్, 30 రోజుల పాటు ఎలక్ట్రికల్ అండ్ హౌస్ వైరింగ్, 30 రోజుల పాటు ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీలో శిక్షణ ఉంటుందన్నారు. స్త్రీలకు 30 రోజుల పాటు హోమ్ నర్సింగ్(శిక్షణ అనంతరం ఇండియన్ రెడ్‌క్రాస్ సాయంతో హైదరాబాద్‌లో జాబ్), 30 రోజుల పాటు లేడీస్ టైలరింగ్, 30 రోజుల పాటు మగ్గం వర్క్, 45 రోజుల పాటు కంప్యూటర్ డీటీపీలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. లేడీస్ టైలరింగ్‌కు ఐదో తరగతి అర్హత అని, మిగిలిన వాటికి స్త్రీ, పురుష అభ్యర్థులిద్దరూ పదో తరగతి ఉత్తీర్ణులై, 19 నుంచి 40 ఏళ్ల వయసు లోపు ఉండాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు ఉంటాయన్నారు. పదో తరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఈ నెల 27వ తేదీన నేరుగా నైరేడ్‌కు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9014716255, 9491741129ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థి ప్రతిభ



జయంత్

బొబ్బిలి: ఏపీఆర్‌డీసీ(ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్) ఫలితాల్లో మండలంలోని శివడవలస గ్రామానికి చెందిన విద్యార్థి శంబంగి జయంత్ విశేష ప్రతిభ చాటాడు. రాష్ట్ర స్థాయిలో 16వ ర్యాంక్ సాధించి, జిల్లా సత్తా చాటాడు. జయంత్‌కు ఇంటర్మీడియట్‌లో 947 మార్కులు రాగా, తల్లిదండ్రులు రాధ, అర్జునరావులు వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు కావడం గమనార్హం.

విగ్రహాల చోరీపై ఫిర్యాదు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని పూల్‌భాగ్ వద్ద ఉన్న గుర్రపు కోనేరు లక్ష్మీనారాయణ ఆలయంలోని విగ్రహాలు చోరీ ఘటనకు సంబంధించి, గీతా మండపం, హిందూ ఉత్సవ సమితి సభ్యులు కలిసి కలెక్టర్, బొబ్బిలి సీఐ, మున్సిపల్ కమిషనర్‌లకు శుక్రవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. ఆలయ శిఖరాన ఉన్న కలశంతో పాటు విగ్రహాలు కూడా లేవని, వాటిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించి ఉంటారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇద్దరికి గాయాలు

వంగర: బైక్ బోల్తాపడి ఇద్దరు వ్యక్తులకు గాయాలైన ఘటన మండల పరిధిలోని మద్దువలస సమీపంలో శుక్రవారం జరిగింది. మద్దువలస నుంచి రేగిడి మండలంలోని సరసనాపల్లి వైపు బైక్‌పై వెళ్తున్న బొమ్మాళి గౌతమ్, బొమ్మాళి అవినాష్‌లు ఓ మలుపు వద్ద వారి బైక్ అదుపుతప్పి పడిపోయింది. దీంతో వారిద్దరూ కిందపడి గాయాలపాలయ్యారు. క్షతగాత్రుల్లో గౌతమ్ పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల సహాయంతో వైద్యసేవల నిమిత్తం 108 అంబులెన్స్‌లో రాజాం సామాజిక ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. ఈ ఘటనపై ఎస్‌ఐ జనార్దన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ వైపే ప్రజాతీర్పు



బొబ్బిలి వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి, ప్రజాతీర్పు వైఎస్సార్ సీపీ వైపే ఉందని, జూన్ 4న వెల్లడయ్యే ఫలితాల్లో పార్టీ విజయం సాధిస్తుందని పార్టీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బొబ్బిలి పట్టణంలోని 31 వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులతో శుక్రవారం సమావేశమైన ఆయన.. ఎన్నికలు జరిగిన విధానం, పోలింగ్ శాతం, ఓటింగ్ సరళిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే.. తనకు అండగా నిలిచిన ఓటర్లు, ప్రజలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని మెజార్టీ ఓట్లు వైఎస్సార్ సీపీకే పడ్డాయని ఆయా వార్డుల కౌన్సిలర్లు తెలిపారు. సమావేశంలో జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జి శంబంగి శ్రీకాంత్, పట్టణ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటి గోపాలరావు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి



గ్రామాల్లో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

బాడంగి: పదో తరగతి ఉత్తీర్ణులైన పిల్లలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని కళాశాల అధ్యాపకులు తల్లిదండ్రులను కోరారు. మండలంలోని ముగడ, భీమవరం, పాల్తేరు, పిన్నవలస, కోడూరు తదితర గ్రామాల్లో పదో తరగతి పాసైన విద్యార్థుల ఇళ్లకు శుక్రవారం వెళ్లి, ప్రభుత్వ కళాశాలలోని సదుపాయాలు, నిష్ణాతులైన అధ్యాపకులతో అందిస్తున్న నాణ్యమైన విద్య, తదితర అంశాలను వివరించారు. ఇంగ్లిష్, తెలుగు మీడియంలలో విద్యాబోధన ఉంటుందని, విద్యార్థులు తమకు ఇష్టమైన మీడియంలో చదువుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రవికుమార్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని బంగారువలస గ్రామంలో మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు టి.ఈశ్వరరావు, బి.పోలినాయుడులు శుక్రవారం పర్యటించి, పదో తరగతి పాసైన విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. ఉచితంగా నాణ్యమైన విద్యనందించడంతో పాటు ప్రభుత్వం తరఫున పొందే ప్రతీ సదుపాయం అందుతుందని తెలిపారు.

పొలాల్లో పచ్చిరొట్ట వేసుకోండి



పారాదిలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్యామసుందరరావు

బొబ్బిలి: ఖరీఫ్ సాగుకు సన్నద్ధమైన రైతులంతా పొలాల్లో పచ్చిరొట్ట(ఎరువు) విత్తనాలు వేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందరరావు సూచించారు. శుక్రవారం మండలంలోని పారాది గ్రామంలో ఖరీఫ్ సాగు ముందస్తు ప్రణాళికలపై రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. వరినాట్లు వేసే ముందు పచ్చిరొట్ట ఎరువులు వేసుకుంటే నేలసారవంతం అవ్వడంతో పాటు పంట బాగా పండుతుందన్నారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు తీసుకోవాలన్నారు. 10 కిలోల జీలుగు విత్తనాలు రూ.400, కట్టెజనుము రూ.440, పిల్లిపెసర రూ.536 చెల్లించి, తీసుకుని పొలాల్లో వేసుకోవాలని తెలిపారు.

నవధాన్యాల సాగుపై అవగాహన



నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో నవధాన్యాల సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాత్రుని వెంకటరమణ మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేయడం ద్వారా నేల సారవంతంగా తయారు కావడంతో పాటు ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందని తెలిపారు. తొలకరి చినుకులు పడే ముందే ఈ నవధాన్యాలను పొలాల్లో చల్లుకుంటే నేలకు కావాల్సిన పోషకాలు లభిస్తాయని, నీటి ఎద్దడిని నేల తట్టుకుంటుందని, యూరియా, డీఏపీ వంటి వాటిని తగ్గించవచ్చన్నారు. 30 రకాల విత్తనాలతో 10 కిలోల నవధాన్యాలు వేసుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన శ్రీను

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని కొత్తవలస గ్రామానికి చెందిన చిట్టి శ్రీను(31) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని సీఐ డి.మోహనరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. శ్రీను, ఆయన భార్యకు తరచూ గొడవలు జరుగుతుండేవని, వారి కలహాలను పెద్దలు సరిచేసినప్పటికీ పరిష్కారం కాకపోవడంతో మనస్తాపం చెందిన శ్రీను ఈ నెల 15వ తేదీ సాయంత్రం పురుగుమందు తాగాడని తెలిపారు. పురుగుమందు సేవించిన కాసేపటికి అతడు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో అప్రమత్తమైన అతడి కుటుంబ సభ్యులు రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి అతడిని తరలించారన్నారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారని, అక్కడే చికిత్స పొందుతూ మరణించాడన్నారు. మృతుడి తండ్రి సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్యతో పాటు కూతురు, కొడుకు ఉన్నారన్నారు.

పక్కాగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

రేగిడి:

పక్కాగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నూకాలమ్మ సూచించారు. మండలంలోని అంబఖండి గ్రామంలో ఉన్న నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె.. లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహారంను పరిశీలించి, పలు సూచనలు చేశారు. క్రమం తప్పకుండా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బాలామృతం, పౌష్టికాహారం అందజేయాలని తెలిపారు.

సంతకవిటి: మండలంలోని మల్లయ్యపేట, రామారాయపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరుణశ్రీ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె.. గర్భిణులు, బాలింతలు, 7 నెలల నుంచి మూడేళ్ల లోపు వయసు పిల్లలకు అందించే టేక్‌హోమ్ రేషన్ పంపిణీపై ఆరాతీశారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం పక్కాగా లబ్ధిదారులకు చేరాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పురోగతి సాధించాలి

రామభద్రపురం: మనబడి నాడు–నేడు రెండో దశ కింద పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలని ఎంఈవో తిరుమలప్రసాద్ అన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో–2 పెంటయ్య, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.కామేశ్వరరావుతో కలిసి శుక్రవారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ మండలంలో నాడు–నేడు పథకం కింద రెండో దశలో 21 పాఠశాలల్లో అవసరమైన అదనపు తరగతి గదులు, మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఇందుకు గాను రూ.7,44 కోట్ల నిధులు మంజూరయ్యాని, ఇందులో ఆయా పాఠశాలల పేరెంట్స్ కమిటీ సభ్యులు అభివృద్ధి పనులకు రూ.4.81 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇంకా నిధులు మిగిలి ఉన్నాయని, మిగతా పనులు వేగవంతం చేయాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. వేసవి సెలవుల్లోగా పనులు పూర్తి చేయాలన్నారు.

రూ.6లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు

రేగిడి: మండలంలోని బొడ్డవలస గ్రామంలో రూ.6 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. 15వ ఆర్థికసంఘం నిధులతో 130 మీటర్ల మేర ఈ నిర్మాణం చేపట్టామని సర్పంచ్ పట్టాభి, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు జరుగుతుండడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండడం విశేషం.

ఒత్తిడి జయించాలి

వంగర:

ఒత్తిడిని జయించడంతోనే రక్తపోటు నివారణ సాధ్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి సీహెచ్ దయానా తెలిపారు. వరల్డ్ హైపర్ టెన్షన్ డే(ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం) పురస్కరించుకుని, మండల కేంద్రంలో పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె.. అధిక రక్తపోటుకు గల కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చాలామంది ఆహారపు అలవాట్లలో మార్పులు, పనిఒత్తిడి కారణంగా రక్తపోటుకు గురవుతున్నారని, ప్రతిఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మనం తినే రోజువారీ తీసుకునే ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలన్నారు.

రేగిడి: మండల కేంద్రంలో వరల్డ్ హైపర్ టెన్షన్ డే ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు అసిరినాయుడు, సోహినీరాఘవ్‌లు మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతిలోనే ఉంటుందని, మంచి ఆహారం తీసుకుంటే నిత్యం ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ప్రతిఒక్కరూ ఉదయం, సాయంత్రం యోగా, వ్యాయామం చేయడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుందరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండల కేంద్రంలో ప్రపంచ రక్తపోటు దినోత్సవ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి యు.నాగేంద్రప్రసాద్.. రక్తపోటు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతిఒక్కరూ ప్రతిరోజూ వ్యాయామం చేయడంతో పాటు మంచి ఆహారపు అలవాట్లు పాటిస్తూ పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు.

రాజాం: వరల్డ్ హైపర్ టెన్షన్ డే పురస్కరించుకుని, మండలంలోని బొద్దాం, పెనుబాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ఆయా ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ నరేంద్ర, సిద్ధీశ్వరిలు రక్తపోటు బారినపడడానికి గల కారణాలు, నివారణ చర్యలను వివరించారు. నిత్యం వ్యాయామం, యోగా చేయడం ద్వారా ఒత్తిడిని జయించి, రక్తపోటుకు గురికాకుండా ఉండొచ్చన్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య తనిఖీలు చేసుకోవాలని, మంచి ఆరోగ్యం కోసం ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. పెనుబాక, గార్రాజుచీపురుపల్లి, సోపేరు గ్రామాల్లో కూడా ఏఎన్‌ఎంలు, ఎమ్ఎల్‌హెచ్‌డబ్ల్యూవోలు, ఆశా కార్యకర్తలు రక్తపోటు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీలో వంగర పీహెచ్‌సీ సిబ్బంది



రేగిడి: కార్యక్రమంలో పాల్గొన్న వైద్యారోగ్య సిబ్బంది



రాజాం: పెనుబాకలో రక్తపోటుపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



సంతకవిటి: ర్యాలీలో పీహెచ్‌సీ వైద్యాధికారి నాగేంద్రప్రసాద్